క్లుప్తంగా

21న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

గోనెగండ్ల: ఈనెల 21న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లను https://cse.ap.gov.in లేదా https://apms.apcfss.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

- మద్దికెర: స్థానిక ఆదర్శపాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 21వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ సవిత మంగళవారం తెలిపారు. విద్యార్థులు apms.apcfss.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

వైద్య సేవలు

ఆలూరు రూరల్: స్థానిక సచివాలయం-4లో మంగళవారం మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వృద్ధులు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు ఇచ్చారు.

ఓటర్లలో నమ్మకం పెంచడానికే మార్చ్



పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో కేంద్రబలగాలతో మార్చ్ చేస్తున్న ఎస్‌ఐ మల్లికార్జున

తుగ్గలి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్లలో నమ్మకాన్ని కలిగించడంతో పాటు ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించడం కోసం కేంద్రబలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తుగ్గలి ఎస్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రామకొండ, రాంపల్లి, పెండేకల్లు రైల్వే జంక్షన్, ఎద్దులదొడ్డి, తుగ్గలిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లలో నమ్మకాన్ని పెంచడానికి ఇలాంటి ఫ్లాగ్‌మార్చ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా చూడటం పోలీసుల బాధ్యత అన్నారు. ప్రజలతో పాటు రాజకీయ పార్టీల నాయకులందరూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు.

పోషకాలతోనే ఆరోగ్యం

మద్దికెర: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల చిన్న పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో చిన్న పిల్లల సంరక్షణపై అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రక్తహీనత, పిల్లలు ఎదగకపోవడం వంటి లక్షణాలు రాకుండా తప్పనిసరిగా గర్భిణులు, బాలింతలు పోషకవిలువలు కలిగిన ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

పులికనుమ పరిశీలన

ఎమ్మిగనూరు టౌన్: మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మంగళవారం ఎల్లెల్సీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పులికనుమ రిజర్వాయర్‌లోని నీటి నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ శరత్‌చంద్ర ఉన్నారు.

వలంటీర్ల రాజీనామాలు



మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన 18 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి తమ రాజీనామా పత్రాలు అందజేశారు. ప్రజలకు నిస్వార్థ సేవలను అందిస్తున్న తమను ఎన్నికల కోడ్ పేరుతో విధులకు దూరం చేయడంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు.

- గోనెగండ్ల: మండల వ్యాప్తంగా 46 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ సోనిబాయికు అందజేశారు. ప్రతిపక్ష పార్టీలు తమపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వలంటీర్లు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోండి

హొళగుంద: వేసవిలో తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్‌లీల సూచించారు. మంగళవారం ఆయన కడ్లమాగి ఎస్‌ఎస్ ట్యాంకులో నీటి నిల్వలను పరిశీలించారు. తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో నీటి సరఫరా నిలిచిపోవడంతో ఎస్‌ఎస్ ట్యాంకులో నిల్వ ఉన్న నీటితో గ్రామానికి సరిచేయాల్సి ఉందన్నారు. నీటిని వృథా చేస్తే తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు.

ఊపందుకున్న ప్రచారం

ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్నారు. పథకాల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సానుకూలంగా స్పందిస్తూ మరోసారి వైఎస్సార్‌సీపీనే గెలిపించుకుంటామని ముక్తకంఠంతో చెబుతున్నారు. సిద్ధం సభలతో జోరు మీదున్న పార్టీ శ్రేణులకు ప్రజల నుంచి వచ్చే సానుకూలత మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది.



ఆలూరు మండలం మరకట్టు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న విరూపాక్షి

- ఆదరించండి ..అభివృద్ధి చేస్తా

ఆలూరు/రూరల్: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి ప్రజలను కోరుతున్నారు. మంగళవారం మండలంలోని మూసానహళ్లి, కాత్రికి, మరకట్టు, పెద్ద హోతూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కుల, మత, రాజకీయ వివక్ష లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కడితే జగనన్న సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ రంగమ్మ, నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, సొమ్మా రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీరాములు, ఎంపీటీసీ దేవరాజు, మండల కన్వీనర్ ఈరన్న, కో-కన్వీనర్ వీరేష్, వీరభద్రా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, హరిశ్చంద్రా రెడ్డి, మూసానహళ్లి మాజీ సర్పంచ్ సోమశేఖర్, రాము, రామాంజనేయులు, ఎల్లప్ప, అనీల్ ఉన్నారు.

- తుంబళబీడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఈరన్న అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన మృతదేహానికి విరూపాక్షి పూలమాల వేసి, నివాళులర్పించారు.
- ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా విరూపాక్షిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వైకుంఠం మల్లికార్జున చౌదరి కోరారు. మండల పరిధిలోని కాత్రికి గ్రామంలో ఆయన ప్రచారం నిర్వహించారు.
- హత్తిబెళగల్ గ్రామంలో ఎంపీపీ రంగమ్మ తయుడు వీరేష్, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు సొమ్మారెడ్డి, సర్పంచ్ షేకున్‌బీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగేంద్ర వైఎస్సార్‌సీపీ నాయకులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. చిప్పగిరి, నగరడోణ, బెల్డోణ, రామదుర్గం తదితర గ్రామాల్లో ఎంపీపీ జూటూరు హేమలత, మండల కన్వీనర్ మారయ్య, నాయకులు మల్లికార్జున, లోక్‌నాథ్ తదితరులు విరూపాక్షి, బీవై రామయ్యకు ఓటేయాలని ప్రచారం నిర్వహించారు.
- హొళగుంద: వైఎస్సార్‌సీపీ నాయకుడు బుసినే శ్రీరాములు సుళువాయి, మూగుమానుగుంది, సమ్మతగేరి, ముద్దటమాగి, కోగిలతోట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యేగా విరుపాక్షిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌలాలి, ఎంపీటీసీలు మల్లికార్జున, మల్లి, నాయకులు కోగిలతోట శేషప్ప, హసనప్ప, వన్నూరప్ప, ఎస్కే గిరి, చాకలి శేఖర్ పాల్గొన్నారు.
- ఆస్పరి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరపున ఆ పార్టీ నాయకులు బుసినె వెంకటేశులు, చంద్రశేఖర్ బనవనూరు, కారుమంచి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ చంద్రకళ, సర్పంచులు లక్ష్మి, పెద్దరెడ్డితో కలిసి వారు ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యేగా విరూపాక్షిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివానంద, వెంకటేష్, రాజన్నగౌడ్, కౌలుట్లయ్య, హసన్, ప్రకాష్, చెన్నప్ప, మహానంది, శ్రీనివాసులు, సూరి, నల్లారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి: హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేనకు చెందిన 45 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి విరూపాక్షి చిప్పగిరిలోని తన స్వగృహంలో పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, మల్లికార్జున, బసన్న, రామలింగ, విరూపాక్షి, శివరాజు, గణేష, మల్లయ్య, లింగప్ప, జ్యోతిలింగ, రామలింగ, పాండు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి

సంక్షేమం కావాలంటే జగనన్నే రావాలి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు రూరల్: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు అసెంబ్లీ అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. మంగళవారం 9వ వార్డులో ప్రచారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ రాజరత్నం, వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, కుర్ని కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని బుట్టా రేణుక కోరారు. జగనన్న ఇచ్చిన సంక్షేమ పథకాలు అందాయని, ఆయన రుణం తీర్చుకునేందుకు మే 13వ తేదీ కోసం ఎదురు చూస్తున్నామని కాలనీకి చెందిన దేవమణి, తమ ఇంట్లో మూడు ఓట్లు ఉన్నాయని మూడు జగన్‌కే వేస్తామని వీధి వ్యాపారి షేక్‌బీ చెప్పడంతో నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రచారంలో పట్టణ అధికార ప్రతినిధి సునీల్ కుమార్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షులు రియాజ్, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బీఎస్.నాగరాజు మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ అబ్రార్, బుట్టా నీలకంఠ, ఫకృద్దీన్, టికె.గౌస్, జిలాన్, ఖాజ, కౌన్సిలర్లు అమానుల్లా, వాహిద్, నీలకంఠ, సుధకార్, ఇన్‌చార్జ్‌లు షాబుద్దీన్, ప్రతాప్‌రెడ్డి, తారా రాజశేఖర్, షాబుద్దీన్, రుద్రాక్షుల బజారి, నాయకులు మాధవస్వామి, రఫీక్, ప్రభాకర్, గట్టుఖాజ, గోకారి, గౌస్, వడ్డే రంగన్న, రహంతుల్లా, రఘువీర, హర్ష, బుట్టా యూత్ నాయకులు ఫయాజ్, ఉబేద్ పాల్గొన్నారు.

- నందవరం: మండలంలోని నదికై రవాడి, కొత్త కైరవాడిలో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి బుట్టా రేణుక తనయుడు ప్రతుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తన తల్లి రేణుకను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, నాయకులు విరుపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, ఈశ్వరమ్మ, చాంద్‌బాషా, సురేష్‌కుమార్, కృష్ణమూర్తి, డీలర్ వెంకటేష్, నరహరిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీని వీడి..

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండలం మిట్టసోమపురం గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వడ్ల స్వామిదాస్, పూలచింత పెద్ద లింగన్న, లాజర్, యోహన్, పక్కీరప్ప, మెసెక్, పాలయ్య, మత్తయ్య, సుదర్శనం, రత్నమయ్య, జాను, అబ్లిశ్యామ్, దావీదు, మాజీ డీలర్ మోజేష్, బోయ ఉరుకుందు, చాకలి శ్రీనివాసులు, పకీరప్ప, బోయ లింగమూర్తితోపాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు నరసింహులు, పెద్దలింగన్నల ఆధ్వర్యంలో బుట్టా రేణుక పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుట్టా ప్రతుల్, వెంకటేష్, చిన్నరాముడు, లింగన్న, శ్రీను, నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

- మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన నజీర్‌అహమ్మద్‌సాహెబ్ రఫీక్, ఓవైసీ, బందెనవాజ్, పౌలు, రాజేష్‌లు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి బుట్టా రేణుక కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



పార్టీలో చేరిన మిట్టసోమపురం నాయకులతో బుట్టా రేణుక



పార్టీలో చేరిన వారితో బుట్టా రేణుక

పార్టీ విజయానికి కృషి చేయండి

వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తనయుడు రామ్మోహన్ రెడ్డి సూచించారు. వెల్దుర్తి మండలం గువ్వలకుంట్లకు చెందిన యువకులు అయ్యస్వామి, పెద్ద అయ్యన్న, గోపాల్, వెంకట్రాముడు, బలరాం, అశోక్, మధు, రామాంజనేయులు, వెంకట్రాముడు, భాస్కర్ మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈశ్వరయ్య, మద్దిలేటి, కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, శ్రీరాంరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో రామ్మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరులో బాలయ్య ఫ్లాప్ 'షో'

- మొరాయించిన మైక్‌సెట్
- నిరాశచెందిన అభిమానులు

ఎమ్మిగనూరు: సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఎమ్మిగనూరు పర్యటన ఫ్లాప్ షోగా మారింది. స్వర్ణాంధ్ర యాత్ర పేరుతో హిందూపురం ఎమ్మెల్యే, హీరో బాలకృష్ణ మంగళవారం సాయంత్రం 5.45గంటలకు ఎమ్మిగనూరుకు చేరుకొన్నారు. శివ సర్కిల్‌లో అభిమానులనుద్దేశించి బాలకృష్ణ ప్రసంగం మొదలు పెట్టగానే టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన మైక్ సెట్ మొరాయించింది. దీంతో బాలకృష్ణ ప్రసంగం ఎవరికీ అర్థంకాక అభిమానులు, కార్యకర్తలు వెనుదిరిగారు. ఏర్పాట్లలో లోపాలతో విసుగుచెందిన బాలకృష్ణ తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించి ఆదోని రోడ్డు, ఓంశాంతి సర్కిల్ మీదుగా మంత్రాలయం నియోజకవర్గంలోకి వెళ్లారు. రూట్ మ్యాప్‌లో ఆర్టీసీ బస్టాండ్ మీదుగా పోలీస్ స్టేషన్, శివ సర్కిల్, కూరగాయల మార్కెట్, ట్యాంక్ బండ్ రోడ్డు, శ్రీనివాస సర్కిల్, మార్కెట్ యార్డు సర్కిల్ మీదుగా బాలకృష్ణ రోడ్డు 'షో' ఉంది. ఏర్పాట్లలో లోపాలు, తన ప్రసంగం మొదలవ్వగానే ప్రజలు వెనుదిరగటంతో బాలకృష్ణ రూట్ మ్యాప్‌లో రోడ్‌షో చేయకుండా మంత్రాలయం వెళ్లిపోయారు. ఆయా సర్కిళ్లలో బాలకృష్ణ కోసం వేచి ఉన్న అభిమానులు నిరాశతో వెనుదిరిగారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి ఏర్పాట్లు సక్రమంగా చేయకపోవటంతోనే బాలయ్య ఆగ్రహంతో రోడ్ షో రద్దు చేసుకొని వెళ్లాడంటూ ఆపార్టీ నేతలు గుసగుసలాడారు. బాలకృష్ణ షోతో ఓట్ల లబ్ధిపొందాలనుకున్న టీడీపీ నేతల ఆశలు అడియాసలయ్యాయి. మొత్తం మీద ఎమ్మిగనూరులో బాలయ్య రోడ్డు షో 'ఫ్లాప్ షో' అయ్యింది.

కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలి

తుగ్గలి: ఉపాధి హామీ పథకంలో కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలీ వస్తుందని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం రామాపురం వద్ద చేస్తున్న డగ్‌అవుట్ ఫాంపాండ్ పనులను ఆమె తనిఖీ చేశారు. పనిప్రదేశంలో మస్టర్లను పరిశీలించారు. ఉపాధి పథకంలో కొలతల ప్రకారం పని చేస్తే రోజూ రూ.300 వేతనం అందుతుందన్నారు. పనులు పారదర్శకంగా చేయాలని కూలీలకు సూచించారు. వేసవి ఎండలను దృష్టిలో కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నీడ ఉండేలా ఉపాధి సిబ్బంది చూసుకోవాలన్నారు. ఎంపీడీఓ వెంట టెక్నికల్ అసిస్టెంట్లు వెంకప్ప, పరీదప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ బద్రియాదవ్ ఉన్నారు.

కలిసి కట్టుగా పనిచేద్దాం



మాట్లాడుతున్న బుట్టా రేణుక

- వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరు: కలిసి కట్టుగా పనిచేసి ఎమ్మిగనూరులో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి బుట్టా రేణుక నాయకులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెద్దాయన చెన్నకేశవరెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మిగనూరు గెలుపును కానుకగా ఇద్దామన్నారు. గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్లలో చేసిన మంచి పనులను వివరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని కోరాలన్నారు. టీడీపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బుట్టా రేణుకమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ కేశన్న, బీఆర్ బసిరెడ్డి, నాయకులు భీమిరెడ్డి, కోటేకల్ లక్ష్మన్న, రంగస్వామి, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దయ్య, బజారి, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఆలయాలు ముస్తాబు





పెనుమాడలో ఆలయాన్ని అలంకరించిన దృశ్యం, సీతారాముల మూలవిరాట్

కృష్ణగిరి: శ్రీరామనవమి వేడుకలకు మండలంలోని సీతారాముల ఆలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారమే ఆయా గ్రామాల పెద్దలు ఆలయాల వద్ద పందిళ్లు వేసి ముహూర్తం వేడుకలు ఘనంగా చేపట్టారు. మండలంలోని పెనుమాడ, చుంచు ఎర్రగుడి, టి.గోకులపాడు, తొగర్చేడు, కంబాలపాడు, సంగాల, ఆగవేళితో పాటు పలు గ్రామాల్లో ఈ వేడుకలు జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. సీతారాముల కల్యాణాన్ని భక్తులు తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు. పెనుమాడ గ్రామంలో రెండు రోజులు సీతారాముల కల్యాణంతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన పద్మసాలె రమేష్, ధనలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

- మద్దికెర: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు.
- నందవరం: మండలంలోని గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించి, అనంతరం దేవతమూర్తులకు శేషవాహన సేవతో పూర్వవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి హంపేష్ స్వామి తెలిపారు. మండలంలోని కనకవీడు, గంగవరం, రాయచోటి, ధర్మపురం, మాచాపురం, నదికైరవాడి, నాగలదిన్నె తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి సందర్భంగా రాములోరి కల్యాణ మహోత్సవంతో పాటు ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాములోరికి ఉత్సయ్ సేవ నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, భక్తులు తెలిపారు.

రేపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం

ఆలూరు: ఈనెల 18న చిప్పగిరి మండలంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ జూటూరు హేమలత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు దేవనకొండలో విరూపాక్షి ప్రచారం

దేవనకొండ: మండల కేంద్రం దేవనకొండలో బుధవారం ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, కో-కన్వీనర్ కబీర్‌దాసు తెలిపారు.


ఇంటి పన్ను చెల్లించండి

హొళగుంద: ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కోరారు. మంగళవారం ఆయన పన్ను బకాయిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పన్ను వసూలు చేశారు. ఇంటి, కుళాయి పన్ను, లైసెన్స్ రిన్యువల్, బంకు ఎంక్రోచ్‌మెంట్ తదితర పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రేపటి నుంచి రెమిడియల్ తరగతులు

ఎమ్మిగనూరు టౌన్: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఫెయిలైన, ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులకు గురువారం నుంచి స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రెమిడియల్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ మంగళవారం తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థినులను అభినందిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

దేవనకొండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఎస్‌ఓ సునీత అన్నారు. కేజీబీవీలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు సునీత, శివలింగమ్మ, షమీనాబేగం ఆధ్వర్యంలో 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థిని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, వెంకటలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మిగనూరు: అప్రమత్తతతో అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని హనుమాపురం రోడ్డులో అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్లు వంట చేసిన వెంటనే ఆఫ్ చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్యాస్ లీకైనప్పుడు మంటలు ఎలా నివారించాలో మహిళలతో చేయించారు.

- ఆలూరు రూరల్: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆలూరు అగ్నిమాపక అధికారి ఖాద్రి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఉపాధ్యాయ నగర్, కోయనగర్ కాలనీల్లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు మంటలు ఎలా అదుపుచేయాలో చేసి చూపించారు.

లైసెన్సులను రెన్యువల్ చేసుకోండి

హొళగుంద: ప్రతి డీలర్ తమ లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని తహసీల్దారు ప్రసాద్‌రాజు ఆదేశించారు. మంగళవారం ఆయన డీటీ నిజాముద్దీన్, ఆర్‌ఐ దినోజ్‌తో కలిసి రేషన్‌షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆలూరు గోడౌన్ నుంచి తెచ్చుకున్న సరుకులను మరో మారు తూకాలు వేసుకుని గ్రామంలో పంపిణీ చేసేందుకు ఎండీయూ ఆపరేటర్లకు అందించాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా పంపిణీ జరగాలని ఆదేశించారు.